సాక్షి మెదక్

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



శాశ్వతంగా 'ఎంప్లాయ్‌మెంట్'
ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో ఒక్కసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే శాశ్వతంగా ఉపాధి కార్డు చెల్లుబాటుకానుంది. వివరాలు 8లో ▸



దేశ సమగ్రతే లక్ష్యం
దేశాన్ని సమైక్యంగా ఉంచడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లక్ష్యమని మెదక్ విభాగ్ ప్రచారక్ భూపేశ్ అన్నారు. వివరాలు 8లో ▸



నీట మునిగిన ఆశలు
జిల్లాలో కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పొంగి పంటలు నీట మునిగాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

హెల్ప్‌డెస్క్ ద్వారా వినతుల స్వీకరణ
కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: నేడు కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని, హెల్ప్‌డెస్క్ ద్వారానే ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులంతా స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారని, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి అర్జీలు హెల్ప్‌డెస్క్ ద్వారానే స్వీకరిస్తామని చెప్పారు.

బీజేపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

రామాయంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి చైతన్యపర్చాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ఎన్నికల ఇన్‌చార్జి శంకర్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, బాలరాజు, దయానందరెడ్డి, శంకర్, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద మందుల పంపిణీ

నర్సాపూర్: మండల కేంద్రంలోని సువిజ్ఞాన ఆశ్రమంలో పౌర్ణమిని పురస్కరించుకొని పలు జబ్బులకు ఉచితంగా ఆయుర్వేద ఔషధాలు పంపిణీ చేస్తామని ఆశ్రమ వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ తెలిపారు. సోమవారం తమ ఆశ్రమంలో ఆస్తమా, ఎలర్జీ, దగ్గు, దమ్ము వ్యాధులకు ఉచితంగా ఆయుర్వేద ఔషధాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సింగూరుకు వరద



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి 15822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆదివారం భారీ వర్షాలు కురవడంతో డ్యాంలోకి ఇన్‌ఫ్లో పెరుగుతుందని అధికారులు తెలిపారు.

మద్యం దుకాణాలకు ఆరు దరఖాస్తులు



దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మద్యం దుకాణాలకు మొత్తం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్ పరిధిలోని పాతంశెట్టిపల్లి షాపు నంబర్ 15కు మూడు, పాపన్నపేట 10వ దుకాణానికి ఒకటి, రామాయంపేట పరిధిలోని మాసాయిపేట 42వ దుకాణానికి ఒకటి, నార్సింగి 43వ షాపునకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వ్యాపారులు వినియోగించుకోవాలని సూచించారు.

కొమురవెల్లిలో భక్తుల సందడి



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తుల రాకతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు మొక్కులు తీర్చుకున్నారు. పట్నాలు వేసి ఒడిబియ్యం సమర్పించారు. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు.

ఏడుపాయల జనసంద్రం



ప్రత్యేక అలంకరణలో వనదుర్గమ్మ

- 50 రోజులుగా జలదిగ్బంధంలో దుర్గమ్మ
- రాజగోపురంలోనే పూజలు
- మంజీరా వరదలతో భారీ నష్టం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వర్షం రావడంతో పాటు సత్రాలు దొరకక ఇబ్బందులు పడ్డారు. చెట్ల కింద టెంట్లు వేసుకొని సేద దీరారు. కాగా సుమారు 50 రోజులుగా ఏడుపాయల మంజీరా వరదల్లో చిక్కుకుంది. ఆదివారం వరదలు తగ్గడంతో సిబ్బంది ఆలయంలోకి వెళ్లారు. 2016 తర్వాత భారీ స్థాయిలో వచ్చిన వరదలతో ప్రసాదం షెడ్డు కొట్టుకుపోయింది. ఆలయం ఎదుట ఉన్న క్యూలైన్లు వరద పాలయ్యాయి. గర్భగుడిలోని గ్రిల్స్, రేకులు, జాలి ధ్వంసం కాగా, మండపంలోని గ్రానైట్ బండలు, టైల్స్ వరదల్లో కొట్టుకుపోయాయి. ఆలయ ప్రాంగణం మొత్తం పాకురుతో నిండిపోయింది. అయితే ఆలయ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే కొంతమేర నష్టం తగ్గేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయి ఈఓను నియమించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయం శుద్ధి చేసిన తర్వాత గర్భగుడి దర్శనాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అప్పటివరకు రాజగోపురంలోనే అమ్మవారి దర్శనాలు కొనసాగనున్నాయి.



ఆలయం ఎదుట భక్తుల సందడి



వరద తాకిడికి కొట్టుకుపోయిన గ్రిల్స్, ఇనుప జాలి

హస్తంలో నిస్తేజం

- కాంగ్రెస్‌లో ఖరారు కాని ఆశావహుల పేర్లు
- మండల సమావేశాలు నిర్వహించని వైనం
- 5 వరకు జెడ్పీటీసీ అభ్యర్థుల జాబితా పంపాలని కోరిన అధిష్టానం



మెదక్ అర్బన్: ఈనెల 5వ తేదీకల్లా జెడ్పీటీసీ సభ్యులుగా పోటీ చేసేందుకు అర్హులను గుర్తించి, ఒక్కోస్థానం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లను గాంధీ భవన్‌కు పంపాలని పీసీసీ ఆదేశించినా.. మెదక్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎన్నికల సందడి కనిపించడం లేదు. స్థానిక నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి, అభ్యర్థుల పేర్లు గుర్తిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇటీవల గాంధీభవన్ వర్గాలు మాత్రం కొంత మంది కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులకు ఫోన్ చేసి ఆశావహుల వివరాలు అడిగినట్లు సమాచారం.

ఆశావహుల్లో ఆందోళన

జిల్లాలో 21 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, మెదక్ నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే ఈనెల 5 కల్లా జెడ్పీటీసీ స్థానాలకు ఆశావహులను గుర్తించి, ఒక్కో ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లు పంపాలని జిల్లా పార్టీ కమిటీలను పీసీసీ ఆదేశించింది. జిల్లాకు చెందిన, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. కానీ ఇప్పటివరకు అలాంటి సమావేశాలు ఏర్పాటు కాలేదని మండల కార్యవర్గాలు అంటున్నాయి. ఓ వైపు ముగ్గురేసి అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి పీసీసీకి పంపాలనే సూచనలు ఉన్నాయి. కాగా రెండు, మూడు రోజుల కింద పీసీసీ వర్గాలు, కొంత మంది మండల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులకు ఫోన్లు చేసి, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారి వివరాలు అడిగినట్లు తెలుస్తుంది. అయితే వారు తమకు తెలిసిన కొన్ని పేర్లు చెప్పినట్లు సమాచారం.

మెదక్ నియోజకవర్గంలో పోటాపోటీ

మెదక్ నియోజకవర్గంలోని పాపన్నపేట మండలంలో కాంగ్రెస్ నుంచి పంతుల భూమన్న, శ్రీకాంతప్ప, రమేశ్‌గౌడ్, రాజశేఖర్, భరత్‌గౌడ్, సూఫీ, మెదక్ మండలం జెడ్పీటీసీకి శంకర్, నాగరాజు, మురళి, హవేళిఘణాపూర్ మండలం నుంచి శ్రీనివాస్, పరుశురాంగౌడ్, చిన్నశంకరంపేట నుంచి సాన సత్యనారాయణ, భిక్షపతి, ప్రభాకర్, పడాల సిద్దిరాములు, రామాయంపేట నుంచి మహేందర్ రెడ్డి, మోహన్‌నాయక్, శివప్రసాద్‌రావు, నిజాంపేట నుంచి వెంకటేశంతో పాటు ఇంకా కొంతమంది నాయకులు జెడ్పీటీసీ టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం.

ఆసక్తి చూపని నాయకత్వం

రాజకీయాల్లో అనాదిగా అగ్రవర్ణ నాయకుల ఆధిపత్యం కొనసాగుతుంది. బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో ఓసీలకు చాలా చోట్ల రిజర్వేషన్లు ప్రతికూలంగా వచ్చాయి. దీంతో వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలకంగా కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఎలా ఉండబోతుందోనన్న ఆందోళన కూడా రాజకీయ వాతావరణాన్ని రగిలించడం లేదు. దీంతో చాలా చోట్ల ఎన్నికల సన్నాహక సమావేశాలు జరుగలేదని తెలుస్తోంది.

పేర్లు పంపిస్తాం

పీసీసీ సూచన మేరకు ఆదివారం సాయంత్రానికల్లా ఒక్కో ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లు పంపిస్తాం. ఇప్పటికే మండలాల వారీగా సమాచారం సేకరించాం. కొన్ని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేయలేదు. కానీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతున్న వారి పేర్లు తీసుకున్నాం.
– అంజనేయులు గౌడ్, డీసీసీ అధ్యక్షుడు

పత్తి టెండర్

సీసీఐ కేంద్రాల ఏర్పాటులో ప్రతిష్టంభన

- టెండర్లకు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు దూరం
- 8న తుది గడువు.. ప్రభుత్వ చొరవపైనే ఆధారం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4.90 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగు

సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొంది. కేంద్రాల నిర్వహణలో కొత్త నిబంధనల వల్ల తాము నష్టపోయే అవకాశముందని, పాత విధానంలోనే కొనుగోళ్లు చేపడతామంటేనే తాము టెండర్లలో పాల్గొంటామని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. ఈనేపథ్యంలో మూడోసారి పిలిచిన టెండర్లకు ఈనెల 8తో గడువు ముగియనుంది. ప్రభుత్వ చొరవపైనే కేంద్రాల ఏర్పాటు అంశం ఆధారపడి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో పది రోజుల్లో పత్తి మార్కెట్‌లోకి వచ్చే అవకాశముండగా, కేంద్రాలను పారంభించేపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



గజ్వేల్ ప్రాంతంలో గతేడాది పత్తి కొనుగోళ్లు

గజ్వేల్: ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సిద్దిపేట జిల్లాలో ఈసారి 1,07,243 ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చింది. ఇక్కడ 10లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడులు వస్తాయని అంచనా. మెదక్ జిల్లాలో 34,751 ఎకరాల్లో పత్తి సాగులోకి రాగా 4.17 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. సంగారెడ్డి జిల్లాలో సుమారుగా 3.48లక్షల పైచిలుకు ఎకరాల్లో పత్తి సాగులోకిరాగా ఇక్కడ 25లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడులు వస్తాయని మార్కెటింగ్ శాఖ అంచనావేస్తోంది. మూడు జిల్లాల్లో కలుపుకుని సుమారుగా 40లక్షల క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశముంది. పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఏటా 50కిపైగా జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంటారు.

సీసీఐ టెండర్లకు జిన్నింగ్ మిల్లులు దూరం

గతంతో పోలిస్తే సీసీఐ ఈసారి కొనుగోలు కేంద్రాల నిర్వహణకు కొత్త నిబంధనలను అమలు చేయడానికి నిర్ణయించింది. ఇందులోభాగంగానే కేంద్రాలు నిర్వహించే ప్రాంతంలో...ఆ ప్రాంతానికి సంబంధించిన పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలని, ఇతర ప్రాంతాల నుంచి వస్తే కొనుగోలు చేయవద్దని సూచించింది. మరోవైపు సాకర్యాల ఆధారంగా జిన్నింగ్ మిల్లులను ఎల్1, ఎల్2 పేరిట రెండు కేటగిరీలుగా విభజించి ఎల్1 కేంద్రాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నది. ఇక కొనుగోళ్లకు తప్పనిసరిగా 'కాపాస్ కిసాన్ యాప్'ను వాడాలని స్పష్టం చేసింది. తేమశాతం 12కంటే ఎక్కువగా ఉంటే కొనుగోళ్లకు అనుమతి ఉండదని చెబుతూ తరుగు శాతం గతంలో 1.70% ఉండగా, దానిని సగానికి కుదించారు. ఈ నిబంధనలు తమకు గుదిబండగా మారాయని, గతంలో మాదిరిగానే కొనుగోళ్లను కొనసాగిస్తామంటేనే తాము టెండర్లలో పాల్గొని, సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తామని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు టెండర్లు పిలిచినా యాజమాన్యాల నుంచి స్పందన లేకపోగా మూడోసారి పిలిచిన టెండర్లకు ఈనెల 8న తుది గడువుగా విధించారు. మరో పది రోజుల్లో పత్తి ఉత్పత్తులు మార్కెట్ బాట పట్టే అవకాశముండగా, ఆలోగా కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు తప్పవనే పరిస్థితి ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చొరవపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

నిబంధనలు మారిస్తేనే టెండర్లలో పాల్గొంటాం



కొత్త నిబంధనలు అమలు చేయకుండా, గతంలో మాదిరిగా కొనుగోళ్లు చేపడితే సీసీఐ టెండర్లలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాం. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సమావేశం ఉంది. ఇందులో చర్చలు సఫలమవుతాయని భావిస్తున్నాం.
–జిల్లా శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

ఓట్లడిగే హక్కు ఆ పార్టీలకు లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



రామచందర్‌రావుకు గొర్రె పిల్లను బహూకరిస్తున్న గొల్ల కురుమలు

జోగిపేట(అందోల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లను గెలుచుకొని ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రకటించారు. ఆదివారం అందోలులో నిర్వహించిన అలయ్‌– బలయ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ప్రజల్లో బీజేపీ పార్టీకి ఆదరణ ఉందన్నారు. ఎక్కడికి వెళ్లినా తమ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును కూడా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, సంగారెడ్డి, నారాయణఖేడ్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు దేశ్‌పాండే, సంగప్ప, నాయకులు అనంతరావు కులకర్ణి, ప్రభాకర్‌గౌడ్, లక్ష్మీనర్సింహారెడ్డి, వివిధ మండల శాఖల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికంగానే నామినేషన్లు

- ఎంపీడీఓ కార్యాలయాల్లోనే కౌంటర్లు
- 21 ఏళ్లు నిండిన వారే పోటీకి అర్హులు

నారాయణఖేడ్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు స్థానికంగా మండల పరిషత్తు కార్యాలయాలు (ఎంపీడీఓ)ల్లోనే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీటీసీ స్థానానికి గానీ, జెడ్పీటీసీ స్థానానికి గాను ఆయా మండలాలకు సంబంధించిన వారు సదరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసే కౌంటర్‌లో ఆర్వోలకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఎంపీటీసీ స్థానం ఎన్నికల నిర్వహణకు గాను గెజిటెడ్ హోదా ఉన్న హెడ్‌మాస్టర్లు, లెక్చరర్లు, ఇతర అధికారులను రిటర్నింగ్ అధికారిగా నియమించనున్నారు. సదరు అధికారి తాను పని చేసే మండలం, సొంత మండలం రెండు అంశాలను పరిగణలోకి తీసుకుని ఇతర మండలాల వారిని ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తున్నారు. జెడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఆ క్లస్టర్ పరిధిలో వచ్చే ఎంపీటీసీ స్థానాల వివరాలను సంబంధిత ఆర్వోల వద్ద ప్రదర్శిస్తారు. తొలివిడత పరిషత్ ఎన్నికల కోసం ఈ నెల 9న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. పోటీ చేసే అభ్యర్థితోపాటు ముగ్గురికి మాత్రమే నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ప్రచారాలకు అనుమతులు లేవు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థి వయస్సు నామినేషన్ల స్వీకరణ నాటికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి.



డిపాజిట్ తప్పనిసరి..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కేటగిరీని బట్టి డిపాజిట్ చెల్లించాలి. ఎంపీటీసీగా పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.2,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250, జెడ్పీటీసీ జనరల్ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.2,500, గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసే జనరల్ అభ్యర్థి రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.1000, వార్డు సభ్యుడు జనరల్ అభ్యర్థి రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250లు చెల్లించాలి. పోటీ చేసే అభ్యర్థులు పంచాయతీకి పన్ను బకాయి, కరెంటు బిల్లులు క్లియర్ చేసి ఆ రశీదును తీసుకోవాల్సి ఉంటుంది. తమ నామినేషన్ల సందర్భంగా కులధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

అన్నదాతకు వరుణ గండం

- వరికోతల వేళ వెంటాడుతున్న వర్షాలు
- ధాన్యం కొనుగోళ్లకు అధికారుల ఏర్పాట్లు
- జిల్లాలో 4.23 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా



మెదక్ మండలంలో వరి కోతకు సిద్ధంగా ఉన్న పొలం

మెదక్‌జోన్: ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతన్నకు పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తునాయి. ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరికోత దశలో వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఈ నేపథ్యంలో వదలని వానతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో కర్షకులు కొట్టుమిట్టాడుతున్నారు.

503 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.5 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం 2.28 లక్షలు, సన్నాలు 77 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇందుకోసం 7.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో 3.39 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు ఆహారం కోసం నిల్వ ఉంచుకుంటారు. విత్తన కంపెనీలకు కొంత మేర పోనూ, మరికొంత బయట వ్యాపారులకు విక్రయిస్తారని భావిస్తున్నారు. అదిపోను కొనుగోలు కేంద్రాలకు 4.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 503 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

3 గంటలు.. 12 సెంటీమీటర్లు

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సుమారు 3 గంటల పాటు వర్షం దంచికొట్టింది. జిల్లాలోని చిన్నశంకరంపేట, చేగుంట, మెదక్, హవేళిఘణాపూర్, నార్సింగి, కౌడిపల్లి, కొల్చారం, నర్సాపూర్, పాపన్నపేట, టేక్మాల్, చిలప్‌చెడ్ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఇప్పటికే మొక్కజొన్న పంటను కోసి ఆరబెట్టగా, 40 శాతం వరి పంటలు కోతకు వచ్చాయి. కానీ వర్షాల కారణంగా పంట చేతికందుతుందా..? లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోత కోయలేరు.. ఆరబెట్టలేరు

ఈ ఏడాది భారీ వర్షాలతో ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కాగా మిగిలిన పంటనైనా కోసి అమ్ముకుందామంటే వర్షాలు వెంటాడుతున్నాయి. చైన్ మిషన్లతో వరి పంటను కోసినా, ధాన్యాన్ని ఆయబెట్టలేని దుస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు, ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులు, విద్యార్థులతో సంఘం ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల నూతనంగా ప్రభుత్వ ఉద్యోగం పొందిన పలువురిని ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువులు, పుట్టిన ఊరుకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో కోశాధికారి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి దుర్గయ్య, సహాయ కార్యదర్శి నర్సింహులు, లక్ష్మణ్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్ రిమాండ్



డ్రైవర్ అయుబ్‌ఖాన్‌తో పోలీసులు

బెజ్జంకి(సిద్దిపేట): రాజీవ్ రహదారిపై శనివారం తల్లీకూతురు మరణానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ అయూబ్‌ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సిద్దిపేట రూరల్ ఇన్‌చార్జి సీఐ పి.శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. అజాగ్రత్తగా, మద్యం మత్తులో వ్యాన్ నడిపి ఇద్దరి మరణానికి కారణమైన డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సౌజన్య, ఏఎస్ఐ శంకర్‌రావు పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థి మృతి



ప్రభాస్

చిన్నశంకరంపేట(మెదక్): డెంగీ జ్వరంతో విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాధానోపాధ్యాయుడు కుమ్మరి శ్యామ్ కుమారుడు ప్రభాస్(20) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పది రోజుల క్రితం జ్వరంతో బాధపడుతూ తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. మెదక్ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించారు. వెంటనే హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రభాస్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పేకాట స్థావరంపై దాడి

20 మందిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేశ్ వివరాల ప్రకారం ... అమీన్‌పూర్ మున్సిపాలిటీ మండే మార్కెట్ సమీపంలో విందు హోటల్ నిర్వాహకుడు చంద్రకాంత్ రెడ్డి పేకాట ఆడిస్తున్నారని విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో శనివారం రాత్రి ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. లక్షా 20 వేల నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక కారు, 21 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఆంజనేయులు, భార్య నాగమణి శనివారం రాత్రి కొండకల్‌లో ఉండే బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి వేసిన తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు, 20 తులాల వెండి, రెండు జతల కమ్మలు, రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నర్సాపూర్‌రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం... పట్టణంలోని సునీతారెడ్డి కాలనీకి చెందిన పాత్‌లోత్ భిక్షపతి దసరా పండుగకు ఈనెల2న అన్నారంలోని తన కూతురు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఈనెల 4న రాత్రి ఇళ్లు మంటల్లో కాలిపోతుందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఇంటికి వచ్చారు. అప్పటికే ఫైర్ ఇంజిన్, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పారు. కాగా ఇంట్లోని ఇంటి పత్రాలు, భూ పట్టా బుక్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఇతర సామగ్రి పూర్తి కాలిపోయాయి. అయితే ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

శాశ్వతంగా.. ఎంప్లాయ్‌మెంట్ కార్డు

ప్రయోజనం పొందనున్న నిరుద్యోగులు
- ఎంప్లాయ్‌మెంట్‌లో నమోదు చేసుకోవాలి
- అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపాధి అధికారులు

నిరుద్యోగ యువత ఉపాధి కోసం వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఎంప్లాయ్‌మెంట్ కార్డులు ఉంటే వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. జిల్లాలోని వివిధ కంపెనీలతో అధికారులు మాట్లాడి ప్రతి నెలా మూడు నుంచి ఐదు జాబ్ మేళాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో ఒక్కసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు శాశ్వతంగా ఉపాధి కార్డు చెల్లుబాటవుతుంది. ఇందుకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

– సంగారెడ్డి టౌన్:



నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో గతంలో ఎంతోమంది యువత కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు. ఉన్నత చదువులు చదివిన ప్రతి ఒక్కరూ ఎంప్లాయ్‌మెంట్ కార్డు (ఉపాధికార్డు) తప్పనిసరిగా ఉండాలి. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకున్న అభ్యర్థులు గతంలో మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. గడువు తీరాక రెన్యూవల్ చేసుకునేందుకు ఇబ్బందులు తలెత్తేవి. రెన్యూవల్ చేయని కార్డులు రద్దయ్యేవి. దీంతో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో అభ్యర్థుల సంఖ్య తగ్గిపోతుండేది. ఇప్పుడు ఆ కష్టాలు తొలగిపోయాయి. ఒక్కసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు కార్డు చెల్లుబాటవుతుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. అవగాహన లేక చాలామంది ఉపాధికార్డుకు దరఖాస్తు చేసుకోవడం లేదు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఆపై ఉన్నత చదువులు చదివిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా 15.28 లక్షల జనాభా ఉండగా అందులో సుమారుగా 7 లక్షల 20 వేల మంది యువత ఉంటే.. 11,850 మంది మాత్రమే కార్డుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఉపాధి కార్డులు కావాల్సిన వారు ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దగ్గరలోని మీసేవ లేదా ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లి ఉపాధి కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి. సాంకేతిక నైపుణ్యం కలిగిన వారు ఫోన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందు కోసం www.employment.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. దీంతోపాటు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల్లో నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఒక్క రోజులోనే కార్డు..

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఒక్క రోజులోనే శాశ్వత ఉపాధి కార్డులు జారీ చేస్తున్నారు. గతంలో కార్డులను తీసుకోకపోతే సీనియారిటీని కోల్పోవాల్సి వచ్చేది. ఏ ఇబ్బంది లేకుండా కొన్ని నెలలుగా జిల్లా ఉపాధిశాఖ కొత్తగా శాశ్వత కార్డుల విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో ప్రతి మూడేళ్లకోసారి కార్డులను తీసుకోవాల్సిన అవసరం ఉండదు. గతంలో రద్దయిన వారు ఇప్పుడు కొత్తగా నమోదు చేసుకుంటే శాశ్వతకార్డులు అందజేస్తారు. దీనిపై నిరుద్యోగులకు ఉపాధిశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగ మేళాలకు హాజరయ్యే వారికి ఉపాధికార్డులు లేకపోతే దరఖాస్తులను స్వీకరించి కార్డులు జారీ చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఒక్క రోజులోనే కార్డులు జారీ చేస్తున్నారు. అత్యవసరమైన వారికి వెంటనే ఇస్తున్నారు.

విస్తృతంగా అవగాహన



ప్రస్తుతం ఉద్యోగాలకు పోటీ పెరుగుతున్న నేపథ్యంలో నిరుద్యోగులు ఉపాధి కల్పన కార్యాలయంలో శాశ్వత ఉపాధికార్డుకు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. జాబ్ మేళాలు, ఎంప్లాయ్‌మెంట్ కార్డులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – అనిల్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి

చర్చి వద్ద ఇరువర్గాల ఘర్షణ

నచ్చజెప్పిన పోలీసులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని సీఎస్ఐ చర్చి ఆవరణలో ఆదివారం ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. వివరాలు ఇలా... చర్చి కమిటీ ఎన్నికలు ఇటీవల జరిగాయి. కాగా ఎన్నికల్లో చర్చి ఫాదర్ రెవరెండ్ సందీప్‌కుమార్ ఒక వర్గానికి అనుకూలంగా పని చేశారని ఓటమి చెందిన ప్యానెల్ ప్రతినిధులు రాజ్‌కుమార్, నవీన్, జయప్రకాశ్ తదితరులు ఆరోపించారు. అందులో భాగంగా రాజ్‌కుమార్ ప్యానెల్ సభ్యులు ఫాదర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ఉన్న బ్యానర్‌ను పట్టుకుని చర్చి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. దీంతో కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు అక్కడికి చేరుకుని ప్రార్థనలు చేసే సమయంలో చర్చి ఆవరణలో నినాదాలు చేయడం సరికాదని, ఇతర చర్చి సభ్యులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. ఏదైనా ఉంటే చర్చి కార్యాలయంలో కూర్చుని మాట్లాడుకుందామని, లేదా హెడ్ ఆఫీసులో ఫిర్యాదు చేయాలని సూచించారు. అయినా వినకుండా రాజ్‌కుమార్ వర్గీయులు నిరసన కొనసాగించారు. కాగా పోలీసులకు సమాచారం అందడంతో చర్చి వద్దకు వచ్చి ఇరు వర్గాలకు నచ్చజెప్పి గొడవ సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఇరువర్గాలకు సూచించారు.



చర్చి ఆవరణలో ఇరువర్గాలకు నచ్చజెబుతున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం... లింగారెడ్డిపల్లికి చెందిన వృద్ధురాలు సంపంగి మల్లవ్వ (70) పట్టణ శివారు రాజీవ్ రహదారిపై ఆదివారం రోడ్డు దాటుతున్న క్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది.

చికిత్స పొందుతూ వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... వికారాబాద్‌కు చెందిన కృష్ణ(45) బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం వచ్చి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో ఉంటూ కూలీ పని చేస్తున్నాడు. కృష్ణ మద్యం తాగి ఇష్టం వచ్చినట్లు చేసేవాడు. గత నెల 29న దసరా నేపథ్యంలో భార్య అనిత వికారాబాద్‌కు వెళ్లి... తిరిగి ఈ నెల 3న ఇంటికి రాగా పురుగుల మందు తాగి కృష్ణ వాంతులు చేసుకుంటున్నాడు. గమనించిన భార్య వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

నెలలో 20 పాడి గేదెలు మృతి

జగన్నాథ్‌పూర్‌లో ఘటన

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌లో నెల రోజుల వ్యవధిలో 20 పాడిగేదెలు మృతి చెందాయి. తాజాగా ఆదివారం గ్రామానికి చెందిన ప్రకాశ్, జగన్‌లకు చెందిన రెండు పాడిగేదెలు మరణించాయి. పాడి రైతుల వివరాల ప్రకారం.. ప్రతీ ఏడాది పశువైద్య అధికారులు పాడి గేదెలకు వ్యాక్సినేషన్ చేసేవారని, ఈ ఏడాది చేయలేదన్నారు. దీంతో కడుపునొప్పికి గురై మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. పశువుల మృతిపై పశువైద్యాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక్కో పాడిగేదే విలువ రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. ప్రకాశ్, జగన్లకు చెందిన రెండు పాడిగేదేలు మృతి చెందగా, నెల రోజులుగా సుభాష్, గైని నర్సయ్య, షాదుల్, రఘునాథ్, రాజుగౌండలతో పాటు మరి కొందరి పాడిగేదేలు మృతి చెందాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గేదెల మృతిపై విచారణ జరిపి, ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.



మృతి చెందిన పాడిగేదెలు

మీటర్, స్టార్టర్‌బాక్స్ ధ్వంసం

రాజీపేట పాఠశాలలో ఘటన

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు మీటర్, స్టార్టర్ బాక్స్‌ను ధ్వంసం చేశారు. వివరాలు ఇలా... మండలంలోని రాజీపేట ప్రాథమికోన్నత పాఠశాలలో దసరా సెలవుల సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలకు తాళం వేశారు. కాగా పునఃప్రారంభం రోజు వచ్చేసరికి పాఠశాలలోని కరెంట్ మీటర్, బోర్ స్టార్టర్ బాక్స్ ధ్వంసమై ఉన్నాయి. దీంతోపాటు విద్యార్థులు మధ్యాహ్న భోజనం అనంతరం చేతులు కడుకునే ట్యాప్స్‌ను సైతం విరగగొట్టారు. ఈ విషయమై హెచ్ఎం కిశోర్ మాట్లాడుతూ గతంలో సైతం బాత్‌రూమ్‌లో ట్యాప్స్ ధ్వంసం చేశారని, ఇలాంటివి జరగకుండా గ్రామస్తుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పేర్కొన్నారు.





ధ్వంసం చేసిన స్టార్టర్‌బాక్స్, కరెంట్ మీటర్

గడ్డి మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగపురి గ్రామంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి ఎస్ఐ లింగంపల్లి రాజుగౌడ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దేవసబోయిన రామచంద్రయ్య(70) మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ చేయడంతో కొడుకు మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడు..



శివకుమార్

కల్హేర్(నారాయణఖేడ్): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిర్గాపూర్ మండలం నల్లవాగు శివారులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఎస్ఐ మహేశ్ వివరాల ప్రకారం... పోచాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్(34) అప్పులు, కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్ఎస్ఎస్ కరసేవకులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

దేశ సమగ్రతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

మెదక్ విభాగ్ ప్రచారక్ భూపేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశాన్ని సమైక్యంగా ఉంచడమే ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) లక్ష్యమని దేశ మెదక్ విభాగ్ ప్రచారక్ భూపేశ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెదక్ విభాగ్ ప్రచారక్ మాట్లాడుతూ.. వందేళ్లుగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, దేశాభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ సేవలు మరువలేనివన్నారు. దేశంలో ఎక్కడ విపత్తు ఏర్పడినా మొదటగా ఉండేది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే అన్నారు. అనంతరం కరసేవకులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పథ్ సంచాలన్ నిర్వహించారు. వీరికి పట్టణ ప్రజలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

దేశ శ్రేయస్సే లక్ష్యం: ఎంపీ

దేశ శ్రేయస్సే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ పథ్‌సంచాలన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ దేశ అభ్యున్నతికి కృషి చేస్తుందని కొనియాడారు. గ్రూపులుగా విడిపోయిన వామపక్షాలకు ఆర్ఎస్ఎస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. వందేళ్ల నుంచి పేరు మార్చుకోకుండా ఒకే పేరుతో ఉండి దేశ నిర్మాణం కోసం పనిచేస్తున్న సంస్థ ఆర్ఎస్ఎస్ అన్నారు. దేశ సేవకు అంకితం అవుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృషి మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.



పథ్ సంచాలన్‌లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

వడియారం ఘటనలో ముగ్గురు అరెస్టు

చేగుంట(తూప్రాన్): వడియారంలో బైకును ఎత్తుకెళుతున్నట్లు అనుమానించి ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి ఒకరిపై పెట్రోల్‌తో నిప్పంటించిన ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ ఆదివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన మహిపాల్ అత్తగారి ఇంటికి తన స్నేహితుడు యోహానుతో కలిసి వడియారం గ్రామానికి శుక్రవారం రాత్రి వచ్చారు. అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన గుండ్ల రమేశ్‌కు చెందిన బైకును తీసుకెళ్తుంటే బైకును చోరీ చేసి తీసుకెళుతున్నట్లు అనుమానించి మహిపాల్, యోహానుపై దాడి చేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. ఆ ఇద్దరిపై దాడి చేసింది గ్రామానికి చెందిన రామకృష్ణ, రమేశ్, అనీల్‌గా గుర్తించి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



పెట్రోలు దాడి నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కాంట్రాక్టర్ జులుం..

- దుర్గమ్మకు ఒడి బియ్యం పోయడానికి ముడుపులు
- చర్యలు తీసుకోవాలని భక్తుల డిమాండ్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మకు ఒడి బియ్యం పోయడానికి వస్తే ముడుపులు లేనిదే కాంట్రాక్టర్ ముట్టుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నిస్తే.. నీ దిక్కున్న చోట చెప్పుకో అని, రూ.100 ఇస్తేనే ఒడి బియ్యం తీసుకుంటామంటూ బెదిరిస్తున్నాడని కౌడిపల్లి మండలం వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ వాపోయాడు. తాను కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఏడుపాయలకు వచ్చి, దుర్గమ్మ తల్లికి ఒడి బియ్యం పోసేందుకు దేవస్థానం కౌంటర్ నుంచి రూ.50 టికెట్ తీసుకున్నానని తెలిపాడు. కాగా అదనంగా రూ.100 తనకు చెల్లించాల్సిందేనని కాంట్రాక్టర్ హుకుం జారీ చేశాడన్నారు. నిలదీస్తే.. ఇక్కడ మేం చెప్పిందే చట్టమని, నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ దుర్భాషలాడాడని తెలిపారు. ఈ విషయంపై ఆలయ ఈఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి వచ్చిందని, కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. అతని వివరణకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజనులు ఐక్యత చాటాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టడానికి లంబాడీలు ఐక్యతను చాటాలని గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో ఈ నెల 8న నిర్వహించే లంబాడీల సమ్మేళన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొందరు గోండు, ఆదివాసి నాయకులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారన్నారు. లంబాడీలు ఎస్టీలు కాదని అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు 30 వేల మంది గిరిజన జనాభా ఉందన్నారు. గిరిజనుల సమ్మేళనానికి ప్రతి ఇంటికి ఒకరు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు కిషన్ నాయక్, భీమా సాహెబ్, శివరాజ్, తిరుపతి నాయక్, రాజు నాయక్, శ్రీనివాస్ నాయక్, కైలు నాయక్, సత్యం నాయక్ పాల్గొన్నారు.

తాగు వినియోగం లేదా!

నిరుపయోగంగా గోదావరి సంపు
- కోమటిబండ నుంచి పైపులైన్
- కలగానే గోదావరి, మంజీరా అనుసంధానం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

శివ్వంపేట(నర్సాపూర్): తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీరథ ద్వారా మూడు, నాలుగేళ్ల క్రితం శివ్వంపేటలో నిర్మించిన గోదావరి నీటి సంపు వృథాగా ఉంది. నర్సాపూర్ నియోజకవర్గానికి గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో పైపులైన్ పనులు, నీటిని నిల్వ చేసేందుకు శివ్వంపేటలో 800 కేఎల్ సంపును నిర్మించారు. కానీ సంపుని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం మంజీరా నీటి ఎద్దడి నెలకొన్న సమయంలో గోదావరి నీరు అందించేందుకు అవకాశం ఉన్నప్పటికీ సంపు నిర్వహణ లోపంతో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రూ.30 కోట్లతో..

గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండ నుంచి గోదావరి జలాల (హెచ్ఎండబ్ల్యుఎస్) ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో అందుకు అవసరమైన రూ.30 కోట్లు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. గతంలో మంజీరా నీరు గజ్వేల్ నియోజకవర్గానికి తీసుకెళ్లేందుకు సంగారెడ్డి జిల్లా బోరపట్ల నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా రివర్స్ పంపింగ్ గుండా.. అక్కడి నుంచి ఇక్కడికి నీటిని తరలించే ప్రక్రియ చేపట్టారు. కోమటిబండ నుంచి నర్సాపూర్ పీర్లగుట్ట వరకు ఉన్న 45 కిలో మీటర్ల పైపు లైన్‌లో 16 కిలోమీటర్లు కొత్తలైన్ ఏర్పాటు చేశారు. పీర్లగుట్ట వరకు చేరిన నీటిని నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్, శివ్వంపేట, హత్నూర, కౌడిపల్లి, వెల్దుర్తి, కొల్చారం, చిలిపిచెడ్ మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



శివ్వంపేటలో నిర్మించిన గోదావరి సంపు

నిరుపయోగంగా సంపు

గోదావరి జలాల నిల్వకోసం మండల కేంద్రమైన శివ్వంపేటలో 8లక్షల లీటర్ల కెపాసిటీ సంపు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ 100 హెచ్‌పి కెపాసిటీ మోటార్లు మూడు, 60 హెచ్‌పీ కెపాసిటీ మూడు మోటార్లు బిగించి చిన్నగొట్టిముక్ల వద్ద నున్న ఓహెచ్‌బిఆర్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి పీర్లగుంట, దౌల్తాబాద్ వద్ద నున్న ఓహెచ్‌బిఆర్‌కు నీటి తరలింపు ఉంటుంది. ప్రస్తుతం వారం రోజుల నుంచి మంజీరా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. గోదావరి నీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్, సంపు వినియోగంలో లేకపోవడంతో కోట్ల రూపాయలతో చేసిన పనులు నిరుపయోగంగా మారాయి. కలెక్టర్ స్పందించి గోదావరి జలాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నర్సాపూర్‌కు గోదావరి జలాలు అందించేందుకు చేపట్టిన సంపుని వినియోగంలోకి తీసుకొస్తాం. కోమటిబండ నుంచి శివ్వంపేట వరకు ఉన్న పైపులైన్ గేట్‌వాల్, హెర్‌వాల్స్‌లో చిన్నపాటి మరమ్మతులు చేపట్టి గోదావరి నీరు ఇక్కడి ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు గోదావరి, మంజీరా నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.
– నాగభూషణం, వాటర్‌గ్రిడ్ ఈఈ